మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డికి సమస్యలపై వినతిపత్రం అందించిన పేరెంట్స్ కమిటీ సభ్యులు

విద్యార్థులకు న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్లకు వినతి

బీబీనగర్, మార్చి 23 : మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలోని ఆర్మీ కళాశాలను ఘట్‌కేసర్ మండలానికి తరలించి విద్యార్థులకు అన్యాయం చేశారని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయం చేసేలా పోరాడాలని పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు అంజనేయులు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఆర్మీ కళాశాలను సాధారణ కళాశాలగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకొని కళాశాలలో చేర్పించారని, బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఏర్పాటు చేసిన కళాశాలను బీబీనగర్ మండలం నుంచి తరలించి విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాజ్‌పూర్‌లో ముస్లింలకు రంజాన్ తోఫాను అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ పాలనలోనే సంక్షేమ ఫలాలు : పాండు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 23 : బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు, ఫలాలు అందాయని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం పాండు, పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో ఆర్ఎస్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ సొంత నిధులతో ఆదివారం గ్రామానికి చెందిన 110ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా నిత్యావసర సరుకుల కిట్‌లను వారు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి పండుగను వైభవంగా నిర్వహించుకునేందుకు మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ పరంగా ఎంతో తోడ్పాటునందించినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా కరువేనని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగు, తాగు నీటి ఇబ్బందులు నెలకొని రాష్ట్రం వెనుకబాటుకు గురవుతుందని ఆరోపించారు. భువనగిరి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు సొంత నిధులతో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతికి బాటలు వేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం తథ్యమన్నారు.

కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సుబ్బూరి బీరు మల్లయ్య, సందెల సుధాకర్, మాజీ ఎంపీపీలు కేశపట్నం రమేశ్, అతికిం లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ మండల కార్యదర్శి నీలా ఓంప్రకాశ్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మదర్ డైరీ డైరెక్టర్ కస్తూరి పాండు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అబ్బగాని వెంకట్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు బొమ్మారపు సురేష్, చిందం మల్లికార్జున్, బీఆర్ఎస్ నాయకులు వరిగంటి రమేశ్‌గౌడ్, కుతాటి సురేశ్, వల్లపు విజయ్‌కుమార్, పల్లెపాటి రవికుమార్, బాతుక అశోక్, యువజన, మైనార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆలేరు టౌన్ : మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలేరు టౌన్, మార్చి 23 : పట్టణానికి చెందిన నిరుపేద ముస్లిం కుటుంబం ఎండీ సర్వర్ కుమార్తె వివాహానికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు భిక్షమయ్యగౌడ్ సౌజన్యంతో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశంగౌడ్ రూ.5 ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి సారాబూ సంతోష్, వార్డు అధ్యక్షుడు కటకం మల్లేశ్, భిక్షమన్న యువసేన పట్టణాధ్యక్షుడు ఎండీ గోరేమియా, జంగిటి శ్రీధర్ యాదవ్, ఎండీ ఫయాజ్, ముర్తాల సంతోశ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : ఆదినారాయణ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

స్నేహితుడి కుటుంబానికి..

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రానికి చెందిన లారీ డ్రైవర్ రాగటి ఆదినారాయణగౌడ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. నారాయణగౌడ్‌తో పాటు 2000-01లో పదో తరగతి కలిసి చదివిన అతడి స్నేహితులు రూ.70వేల ఆర్థికసాయాన్ని ఆదివారం ఆయన కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో చెరుకు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, శ్రీనివాస్, మత్స్యగిరి, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : గణేశ్‌కుమార్‌కు నగదు అందిస్తున్న స్నేహితులు

చౌటుప్పల్ : పట్టణానికి చెందిన గోశిక గణేశ్ కుమార్ అనారోగ్యానికి గురి కాగా ఆయన 1994-95 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు వైద్యఖర్చుల నిమిత్తం రూ.1.10లక్షలను ఆదివారం అందించారు. కార్యక్రమంలో స్నేహితులు వరగంటి శ్రీనివాస్, బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేప రాజు, గోశిక భాస్కర్, బడుగు రవికుమార్, కొంగం శ్రీనివాస్, గట్టు వినోద్, బోయపల్లి కరుణాకర్ పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో వృద్ధుడికి తీవ్రగాయాలు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 23 : మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలో శనివారం రాత్రి పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన యువకులు ఇబ్రహీం, గుండెగల్ల నరేశ్, మౌలానా అనే వృద్ధుడిని విచక్షణ రహితంగా దాడిచేసి తీవ్ర గాయాలు చేసింది. స్థానికులు గమనించి పిచ్చికుక్కను తరిమికొట్టి గాయపడ్డ ముగ్గురిని చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గ్రామంలో విచ్చలవిడిగా ఉన్న కుక్కలను తరిమివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుట్టలో కాంగ్రెస్ ట్యాక్స్..!

షాపులు పెట్టాలంటే డబ్బులు ముట్టజెప్పాల్సిందే..

- ఒక్కో దుకాణం నుంచి రూ. 2 నుంచి 10 లక్షల వరకు వసూళ్లు
- తాజాగా ఓ పెట్రోల్ బంకు యాజమానిని రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్
- బయటపడిన ఫోన్ రికార్డు

యాదగిరిగుట్ట, మార్చి 23 : కొత్తగా షాపులు, పెడుతున్నారా.., మీకు మున్సిపాలిటీ టాక్స్ కాదు.. కాంగ్రెస్ పార్టీకి కూడా పన్ను చెల్లించాల్సిందే. లేనిచో షాపులకు అనుమతులు రావు,. ఒక వేళ అనుమతివచ్చి ప్రారంభించినా బెదిరింపులు పాల్పడటమే కాక, ఇక ఆ షాపును నడిపించడం కష్టమే. ఆయా షాపుల తీరును బట్టి రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు మామూళ్లు ఇవ్వాల్సిందే. ఇది ఎక్కడో కాదు సాక్షాత్తు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ప్రాంతంలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరు. 'అధికారంలోకి వచ్చాం.. మాకు ప్రజాప్రతినిధుల అండదండలున్నాయి.. ఇక మమ్ముల్ని ఎవరేం చేయలేరు' అని భావించిన పట్టణానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు నయా వసూళ్లకు పాల్పడుతున్నారు. వీరి వసూళ్లకు వేగలేక ఓ పెట్రోల్ బంక్ యజమాని.. స్థానిక ఓ పార్టీకి చెందిన నాయకుడికి ఫోన్ చేసి విన్నవించుకున్న రికార్డు బయట పడటంతో కాంగ్రెస్ నాయకుల వసూళ్ల దందా ఉదంతం బయటపడింది.

అక్రమ మార్గాల్లో..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయాన్ని రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ రూ. 2 వేల కోట్లతో మహాద్భుతంగా తీర్చిదిద్దారు. పునర్నిర్మాణ అనంతరం దేవస్థానానికి దేశవిదేశాల నుంచి రోజుకు 20 నుంచి 50 వేల మంది భక్తులు తరలివస్తున్నారు. కేవలం శని, ఆదివారాల్లో రోజుకు 70 వేలకుపైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. వచ్చి పోయే క్రమంలో భక్తులు పట్టణంలో సేదతీరి అల్పాహారం, భోజనాలు స్వీకరిస్తారు.

యాదగిరిగుట్టలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్

ఇదే అదునుగా హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు పట్టణంలో విస్తారంగా ఉడిపి హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ పాయింట్లు, లాడ్జీలు, పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేసుకుని భక్తులకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలు తీరుస్తున్నారు. ప్రధాన రహదారి రోడ్డుకు ఇరువైపులా హోటళ్లు, టీ పాయింట్లు దర్శనమిస్తాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే యాదగిరిగుట్ట పట్టణంలో రియల్ వ్యాపారం కుప్పకూలింది. గత రెండేండ్లుగా ప్లాట్ల క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన పట్టణ నాయకులకు అభివృద్ధి కాంట్రాక్టు పనులు లేక, రియల్ వ్యాపారం లేక ఇతర మార్గాలను ఎంచుకుని డబ్బులు సంపాదించే పనిలో పడ్డారు.

రూ.2 లక్షల నుంచి 10 లక్షల వసూళ్లు..

యాదగిరిగుట్ట పట్టణంలో నూతనంగా ఏదైనా వ్యాపారం ప్రారంభించాలంటే ప్రభుత్వ అనుమతులే కాదు.. కాంగ్రెస్ పార్టీ నాయకులు అనుమతులు సైతం తీసుకోవాల్సిందే. వారికి ఎంతో కొంత ముడుపులు చెల్లించాల్సిందేనని హోటల్, పెట్రోల్ బంకులు, టీ పాయింట్ల యజమానులు వాపోతున్నారు. లేకపోతే ఇబ్బందులు పడకతప్పదని ఆరోపిస్తున్నారు. ఈ మధ్యకాలంలో పట్టణంలోని యాదవనగర్‌లో ఇతర ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి 200 గజాల్లో ప్రీకాస్ట్ వాల్స్‌తో రూమ్ నిర్మించుకుంటే కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు రూ. లక్ష వసూళ్లు చేసినట్లు సమాచారం. గుండ్లపల్లిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్ ఓనర్ కలిసి రూ. 5 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. సదరు యజమాని పట్టణానికి చెందిన ఓ పార్టీ నాయకుడికి మొర పెట్టుకున్న ఫోన్ రికార్డు వైరల్‌గా మారింది. పెట్రోల్ బంకు ఏర్పాటు చేసేందుకు కావాల్సిన మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, ట్రాఫిక్, అగ్నిమాపక, పోలీసులు, కలెక్టర్, ఆర్డీఓ, తాసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారుల అనుమతులను పొందామని, అయినా తమకు ఎంతో కొంత ఇవ్వాల్సిందేనని కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు వచ్చి తమపై ఒత్తిడి చేస్తున్నారని సదరు యజమాని చెప్పడం రికార్డులో వినిపిస్తున్నది. ఒక్కో హోటల్‌కు వారి వారి స్తోమతను బట్టి రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షలు ఇవ్వాలని ఫోన్ చేసి వసూళ్లకు పాల్పడటం గమనార్హం. స్థానికంగా వ్యాపారం ఏర్పాటు చేస్తే పట్టణ వాసులకు ఉద్యోగావకాశాలు రావడంతోపాటు పలువురికి ఉపాధి సైతం లభిస్తుందని భావించి, హోటళ్లను పెడుతుంటే స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు లక్షలకు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తే ఎలా అని, పట్టణంలో వ్యాపారం చేయాలంటే భయపడే రోజులు వచ్చాయని సదరు వ్యాపారస్తులు వాపోతున్నారు.

వసూళ్లకు కేరాఫ్ అడ్రస్

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కబ్జాలు, దౌర్జన్యాలు, వసూళ్లకు కేరాఫ్ అడ్రసుగా ఆలేరు నియోజకవర్గం మారిందని బీజేపీ యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ అన్నారు. ఆదివారం పట్టణంలో మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం యాదగిరిగుట్ట అభివృద్ధిలో భాగంగా ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు అంజనాపురి కాలనీలో ప్లాట్లను కేటాయిస్తే, ఆ ప్లాట్లను కాంగ్రెస్ నాయకులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. పట్టణంలో కొబ్బరికాయ దుకాణం నుంచి హోటళ్లు, పెట్రోల్ బంకుల వరకు కాంగ్రెస్ నాయకులు వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారని తెలిపారు.

చౌటుప్పల్ : రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వలిగొండ : కేర్చిపల్లిలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాలర్పిస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

భగత్‌సింగ్‌కు నివాళి

యాదగిరిగుట్ట, మార్చి 23 : దేశ స్వాతంత్ర్యం కోసం పరాయి పాలనను వ్యతిరేకించి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నివాళులర్పించారు. మండలంలోని కాచారం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, భగత్ సింగ్ విగ్రహాలకు పూలమాల వేసి, దేశానికి భగత్‌సింగ్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్, భగత్ సింగ్ విగ్రహాల పోరాట కమిటీ కన్వీనర్ సుంచు దేవయ్య, కో కన్వీనర్ బేజాడి కుమార్, మాజీ సర్పంచ్ కొండం అరుణాఅశోక్‌రెడ్డి, ఎంపీటీసీ ఎడ్ల సుగుణరాంరెడ్డి పాల్గొన్నారు.

ఆలేరు టౌన్ : పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మామిడాల ప్రవీణ్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని న్యూడెమోక్రసీ కార్యాలయం ఎదుట భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎలగందుల సిద్ధులు, చిరబోయిన బాలకృష్ణ, కుమారస్వామి,కృష్ణ, నిశాంత్, వెంకటేశ్, బాబు, సాయి, నాని, సీపీఎం నాయకులు ఎంఏ ఇక్బాల్, బాలరాజు, మల్లేశ్, గణేశ్, రాజేశ్, నరేశ్, లక్ష్మణ్, అంజయ్య పాల్గొన్నారు.

బొమ్మలరామారం : సీపీఐ మండలాధ్యక్షుడు అన్నెపైన వెంకటేశ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌కు నివాళి అర్పించారు. మైలారం జంగయ్య, పల్లపు మల్లేశ్, లవుడియా బుజ్జి, తెజావత్ వార్త, ఆనంద్, రెడ్యా పాల్గొన్నారు.

వలిగొండ : సీపీఎం మండల కార్యదర్శి సిరిపంగి స్వామి ఆధ్వర్యంలో మండలంలోని కేర్చిపల్లి గ్రామంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కవిడె సురేశ్, జిల్లా ఉపాధ్యక్షుడె వేముల నాగరాజు, ధ్యానబోయిన యాదగిరి, కందాడి సత్తిరెడ్డి, లోడె మల్లేశం పాల్గొన్నారు.

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుక్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకొని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభించా మాట్లాడారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ విజయమోహన్, ఎస్ఐ యాదగిరి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధుకృష్ణ, జిల్లా కార్యదర్శి లాపుడియా రాజు, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోత్కూరు : సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి ఆధ్వర్యంలో మోత్కూరులో భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. నాయకులు జయరాములు, రాములమ్మ, అంజయ్య, యాదమ్మ పాల్గొన్నారు. మండల కేంద్రంలోని కేఆర్ భవనంలో ఏఐవైఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

యావాపూర్ సమావేశంలో మాట్లాడుతున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

బొమ్మలరామారం, మార్చి 23 : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొస్తే తక్షణం పరిష్కరిస్తానని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని యావాపూర్ గ్రామంలో బిగ్ టీవీ, మెడికవర్ ఆసుపత్రి, జిల్లా వైద్యాఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మెగా మెడికల్ హెల్త్ క్యాంపును నిర్వహించగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆయన వెంట కలెక్టర్ హనుమంతరావు, జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి మనోహర్, ఉప వైద్యాధికారి శిల్పిని, డాక్టర్ సుమలత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బైసు రాజేశ్, సింగిర్తి మల్లేశ్, జంగారెడ్డి ఎర్రి కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల నూతన కమిటీ

నల్ల స్వామి

కోక వేణు

ఆత్మకూరు(ఎం),మార్చి 23 : ఎస్సీ, ఎస్టీ మండల నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల స్వామి, ప్రధాన కార్యదర్శిగా కోక వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవసరి మత్స్యగిరి, ఉపాధ్యక్షుడిగా అచ్చూనాయక్, అండమ్మ, కోశాధికారిగా సంతోశ్, కార్యదర్శిగా వీణ, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తొంట సత్యనారాయణ సంఘం సభ్యత్వ నమోదును అందించి నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి : సీపీఎం

భూదాన్‌పోచంపల్లి, మార్చి 23 : మండలంలోని పెద్దరావులపల్లి నుంచి భూదాన్‌పోచంపల్లి వరకు ధ్వంసమైన రోడ్లను బాగు చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నరసింహ పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

దివ్యాంగ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూ

వలిగొండ, మార్చి23 : దివ్యాంగ కార్పొరేషన్ ద్వారా వలిగొండ మండలానికి మంజూరైన ఒక యూనిట్ రూ.50 వేల లోన్ కోసం లబ్ధిదారుల ఎంపికకు నేడు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో దివ్యాంగుల కోటా లోన్ కోసం అన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారు తమ ఒరిజనల్స్ సర్టిఫికెట్లతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, విద్యార్హత సర్టిఫికెట్లతో ఎంపీడీఓ కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

భూదాన్‌పోచంపల్లి : ఈ నెల 24న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులకు ఆర్థికసాయం పథకం కింద లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాపర్తి భాస్కర్‌గౌడ్ ఆదివారం విలేకరులకు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

వలిగొండ, మార్చి 23 : మండలంలోని కేర్చిపల్లి గ్రామంలో చావా ఫౌండేషన్, ఆర్‌కే ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం 118వ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ చావా రాజ్‌కుమార్, పైళ్ల మల్లారెడ్డి, జంగారెడ్డి, ఆర్‌కే హస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని సింగారంలో క్రిస్టియన్ గాస్పెల్‌చర్చి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. 400 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందించారు. పంచాయతీ కార్యదర్శి శేఖర్,మాజీ సర్పంచ్ యాదయ్య, చర్చిపాధర్ ఇసాక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కబేళాకు తరలిస్తున్న గోవులు పట్టివేత

చౌటుప్పల్, మార్చి 23 : మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామంలో అక్రమంగా కబేళాకు తరలిస్తున్న గోవుల వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. తనిఖీలో భాగంగా వాహనాన్ని పట్టుకోగా.. అందులో 4ఎడ్లు, 2ఆవులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల గ్రామానికి చెందిన డ్రైవర్ రాంశెట్టి రవికుమార్ కోదాడ మార్కెట్‌లో వాటిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని బహుదూర్‌పూర కబేళాకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

గ్రంథాలయ దాతలకు హైకోర్టు జడ్జి సన్మానం

దాతను సన్మానిస్తున్న హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్, కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట, మార్చి 23 : మండలంలోని వెల్లంకి గ్రామంలో ఆచార్య కూరెళ్ల గ్రంథాలయ దాతలను హైకోర్టు జడ్జి కూనూరు లక్ష్మణ్ ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరభాషా మోజులో మాతృభాషను విస్మరించ వద్దన్నారు. తెలుగు భాషా పరిరక్షణ ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కుగ్రామంలో రెండులక్షలకు పైగా పుస్తకాలతో సొంత ఇంటిని గ్రంథాలయంగా మార్చిన కూరెళ్లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, ట్రస్ట్ చైర్మన్ బోగోజు గోవర్ధనచారి, సంస్థ ప్రధానకార్యదర్శి నర్మద, మాజీ సర్పంచులు ఎడ్ల మహేందర్‌రెడ్డి, కూరెళ్ల నర్సింహాచారి పాల్గొన్నారు

పోచంపల్లి బ్యాంకులో అధునాతన సేవలు : రమేశ్

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్

భూదాన్‌పోచంపల్లి, మార్చి 23 : ప్రభుత్వ ప్రైవేట్ రంగ బ్యాంకులకు ధీటుగా పోచంపల్లి బ్యాంకులో అధునాతన సేవలు అందిస్తున్నామని, బ్యాంకును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్ అన్నారు. పట్టణ కేంద్రంలోని చేనేత టై అండ్ డై భవనంలో ఆదివారం పోచంపల్లి బ్యాంక్ 50వ సర్వసభ్య సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుతం బ్యాంకు పది బ్రాంచ్‌లతో కార్యకలాపాలు కొనసాగిస్తుందని, త్వరలో తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్, కల్వకుర్తి పట్టణాల్లో కొత్త బ్రాంచులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరో 8 కొత్త శాఖలు ఏర్పాటు చేయడానికి ఆర్‌బీఐ అనుమతులు మంజూరు చేసిందని, వచ్చే ఆర్థిక ఏడాది నాటికి బ్యాంకు మొత్తం 22 శాఖలకు చేరుకుంటుందన్నారు. బ్యాంకు వాటా ధనం మార్చి2024 నాటికి రూ.6.83కోట్లు ఉండగా, 2025 నాటికి రూ.8.51 కోట్లకు చేరినట్లు తెలిపారు. డిపాజిట్లు మార్చి 2024 నాటికి రూ. 203.35 కోట్లు ఉండగా 2025 నాటికి రూ.230.84 కోట్లుకు చేరిందని పేర్కొన్నారు.

కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, సీఈఓ సీతాశ్రీనివాస్, డైరెక్టర్లు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, ఏలె హరిశంకర్, సురపల్లి రమేశ్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, బిట్టు భాస్కర్, మక్తల నరసింహ, బ్యాంక్ సీనియర్ మేనేజర్లు రాచకొండ మధుసూదన్, రచ్చ శ్రీనివాస్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆడపడుచుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కొండమడుగు ఆడపడుచులు

బీబీనగర్, మార్చి 23 : మండలంలోని కొండమడుగు గ్రామ పరిధిలోని చత్రకాని గూడేనికి చెందిన సుమారు 95 మంది ఆడపడుచులు ఆదివారం ఒక్కచోట సమ్మేళనమయ్యారు. పెండ్లిళ్లు చేసుకొని వేర్వేరు చోట్ల స్థిరపడిన ఆడబిడ్డలంతా సంవత్సరాల తరువాత కలుసుకొని ఆనందంగా గడిపారు. ఇలా ఆడబిడ్డల ఆత్మీయ సమ్మేళనం జరుపుకోవడం ఈ ప్రాంతంలో ఇదే తొలిసారి. ఈ సందర్భంగా నూరేళ్లు నిండిన మాదిరెడ్డి రత్నమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఆల్వ శోభ, అరుణ, గడ్డం ఇందిరా, మంగ, లక్ష్మి, ప్రమీల, స్వరూప, జగదాంబ, శారదమ్మ, రాములమ్మ, చంద్రకళ, కళమ్మ, ఉమా, ఉమాదేవి ఉన్నారు.

ఎకరాకు రూ.30వేలు పరిహారం అందించాలి : నరసింహ

భువనగిరికలెక్టరేట్, మార్చి 23 : జిల్లాలో ఎండిన పంటలు ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నరసింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని నందనం గ్రామ పరిధిలో సింగిరెడ్డిగూడెంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఏదునూరి మల్లేశ్, సురుపంగ ప్రకాశ్, మండల కమిటీ సభ్యులు కొండాపురం యాదగిరి, సిద్దురాజు, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నవీన్‌రెడ్డి (ఫైల్)

భువనగిరి కలెక్టరేట్, మార్చి 23 : మండలంలోని తుక్కాపురంలో ఆదివారం తెల్లవారుజామున మనస్తాపంతో చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఎలకొండ నవీన్‌రెడ్డి(45)కి అదే గ్రామానికి చెందిన తన చిన్నాన ఎలకొండ నరేందర్‌రెడ్డికి వ్యవసాయ బావి వద్ద నీళ్ల పైపులు ధ్వంసమైన విషయంలో ఈనెల 22న గొడవ జరిగింది. ఈ క్రమంలో గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా పైపులను నవీన్‌రెడ్డే ధ్వంసం చేశాడని నరేందర్‌రెడ్డి ఆరోపించాడుఉ. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నవీన్‌రెడ్డి ఆదివారం తెల్లవారుజామున తన చావుకు చిన్నాన నరేందర్‌రెడ్డే కారణమని సెల్‌ఫోన్‌లో బంధువులకు వాయిస్ మెసేజ్ పంపి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సంజీవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ వి.సంతోశ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 23 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాలిక ఆదివారం తెల్లవారు జామున మృతిచెందినది. స్థానికులు, తెలిపిన వివరాలు.. ఈనెల 16 ఆదివారం పట్టణ పరిధిలోని రాయగిరి గ్రామంలో జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న తల్లి, కూతుళ్లను బైక్ అతివేగంతా వచ్చి ఢీ కొట్టింది. దీంతో తల్లి ఉల్లోజు కల్పన(32) అక్కడికక్కడే మృతి చెందగా కుమార్తె భావన(15)కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బాలికను గాంధీ దవాఖానకు తరలించగా తెల్లవారుజామున మృతిచెందింది.



బీబీనగర్ : ఇన్సూరెన్స్ పత్రాలను చూపుతున్న పూర్వ విద్యార్థులు



భూదాన్‌పోంచంపల్లి : ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

బీబీనగర్, మార్చి 23 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో 1995 - 96 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణ శివారులో గల మాండువా హోమ్స్‌లో అధ్యక్షుడు కాసుల అంజనేయులు గౌడ్ అధ్యక్షతన సమ్మేళనమయ్యారు. బ్యాచ్‌లో మొత్తం 116 మందికి ఏడాది పాటు యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీలు చేసుకున్నారు. అందులో పది మందికి బీబీనగర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోలి నరేందర్ రెడ్డి సొంత నిధులతో చేయించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని భీమనపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాలలో 2000-01లో ఐదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పట్టణంలో సమ్మేళనమయ్యారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివజ్యోతి, మురార్‌రెడ్డి, ఉషారాణి, యాదిరెడ్డి, రూన్సీ, విద్యార్థులు శేఖర్, వరలక్ష్మి, జ్యోతి, సంతోష, విజయ, అనిత, శివ, రవి, మల్లేశ్ పాల్గొన్నారు.

ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ మోసం : సీపీఎం

మోటకొండూర్, మార్చి 23 : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజాపాలన పేరుతో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని సీపీఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు అన్నారు. మండలంలోని వర్టూర్-మాటూర్ బీటీ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ ఆ రోడ్డుపై సీపీఎం నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు బైరపాక సర్వయ్య, ఇస్తారి, బాలరాజు, మాతయ్య, యాదయ్య, రాములు ఉన్నారు.